సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 6 । జూలై । 2025

బిర్యానీ.. ప్రియులమండి



సందర్భమేదైనా విందులో బిర్యానీ కామన్. శాకాహార, మాంసాహారులు సైతం బిర్యానీ అంటే ఇష్టంగా ఆరగించేస్తారు. బిర్యానీ ప్రియుల ఇష్టాన్ని తీర్చేలా కొందరు ఆకర్షణీయమైన హోటళ్లతో వ్యాపారం చేయడం ఇప్పుడు నయా ట్రెండ్. వెజ్, నాన్‌వెజ్ రుచులలో జైలు బిర్యానీ, రైలు బిర్యానీ, మండీ బిర్యానీ వంటి పేర్లతో వినియోగదారులను ఆకర్షిస్తూ మూడు ప్లేట్లు, ఆరు లెగ్‌పీసులుగా వర్ధిల్లుతూ నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు హోటల్ వ్యాపారులు. జూలై మొదటి ఆదివారం అంతర్జాతీయ బిర్యానీ దినోత్సవం సందర్భంగా జిల్లాలో హోటళ్లలో అందించే రకరకాల బిర్యానీలపై 'సండే స్పెషల్'...

సండే స్పెషల్

మరారి కుమారస్వామి, ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

8లో

న్యూస్‌రీల్

పందిళ్ల బ్రిడ్జి పనుల్లో వేగం పెంచండి: మంత్రి పొన్నం



పందిళ్ల బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్: జాతీయ రహదారి పనుల్లో భాగంగా హుస్నాబాద్ మండలంలోని రేణుక ఎల్లమ్మవాగుపై చేపట్టిన పందిళ్ల బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఈ బ్రిడ్జి పనుల ను మంత్రి పొన్నం పరిశీలించారు. గత వాన కాలంలో కూడ బ్రిడ్జి లేకపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని అందుకే బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచి వర్షాకాలంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఎల్లమ్మ చెరువు మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రాంమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ బంక చందు తదితరులు ఉన్నారు.

ఐఐటీ ఫౌండేషన్ కోర్సులు ప్రారంభం

మద్దూరు(హుస్నాబాద్): పాఠశాలల అనుసంధాన కార్యక్రమంలో భాగంగా మద్రాస్ ఐఐటీతో ధూళిమిట్ట జెడ్పీహైస్కూల్ భాగస్వామ్యమైంది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పదవ తరగతిలోనే విద్యార్థులు వివిధ ఫౌండేషన్ కోర్సులు పూర్తి చేయవచ్చన్నారు. డేటాసైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్, ఫౌండేషన్ లా, వంటి కోర్సులన్నీ రెండు నెలల కాలవ్యవధితో ఆన్‌లైన్‌లో పూర్తి చేయవచ్చని తెలిపారు. ఇది విద్యార్థులకు ఒక చక్కని అవకాశం అని, కోర్స్ పూర్తయిన వారికి మద్రాస్ ఐఐటీ నుంచి సర్టిఫికెట్ వస్తుందని వివరించారు. తెలంగాణ నుంచి 75 విద్యాసంస్థలు ఈ ఒప్పందం కుదుర్చుకుంటే అందులో చాలావరకు ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేట్ జూనియర్ కాలేజీలే ఉన్నాయని, మొట్టమొదటి ప్రభుత్వ పాఠశాల ధూళిమిట్ట పాఠశాల నేనని ఆయన తెలిపారు.

ఓపెన్ స్కూళ్లలో నమోదు పెంచాలి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని వయోజన విద్య, ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియెట్‌లో నమోదు సంఖ్యను పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఉల్లాస్, టాస్ రాష్ట్ర బృందం శనివారం జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా సిద్దిపేట అర్బన్ విద్యాశాఖ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ...వయోజన విద్య, ఓపెన్‌స్కూళ్లు, ఇంటర్మీడియెట్‌లో నమోదు పెంచేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలో డీఆర్‌డీఏ, ప్రధానోపాధ్యాయుల సహాయంతో ఉల్లాస్, టాస్‌ల నమోదును పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు వెంకట్ రెడ్డి, భాస్కర్, లక్ష్మయ్య, రామస్వామి, విజయకృష్ణ, శివకృష్ణ, ఖదీర్, మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

కేవీలో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట కేంద్రీయ విద్యాలయంలో 7, 9, 10 వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆసక్తి కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10 వ తేదీ లోపు సిద్దిపేట కేంద్రీయ విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజల రక్షణకు సంబంధించి భద్రతాభావం కలిగించడం కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. చిన్నకోడూరులో శనివారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానస్పద ప్రాంతాల్లో నార్కొటిక్స్ డ్రగ్స్ తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళ రక్షణ చట్టాలు, నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు, 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

యూరియా.. లేదయా!

- అవసరానికి తగ్గ నిల్వలు లేక ఇబ్బందులు
- యుద్ధాల నేపథ్యంలో యూరియా దిగుమతులకు బ్రేక్
- ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి నిల్వలు వస్తేనే ఇక్కట్లకు తెర

యూరియా కొరత పొంచి ఉండటంతో రైతుల్లో కలవరం మొదలైంది. వానాకాలం సీజన్ అవసరాలకు, వస్తున్న యూరియా నిల్వలకు పొంతన లేకుండా లేకుండాపోయింది. కొద్ది రోజుల్లోనే కొరత తీవ్రమయ్యే అవకాశాలు స్పష్టమవుతున్నాయి. యూరియాను దిగుమతి చేసుకునే దేశాల్లో యుద్ధ వాతావరణం వీటి కొరతకు కారణమైనట్లు తెలుస్తోంది. యూరియా దిగుమతి చేసుకునే దేశాల మీద ఆధారపడకుండా రాష్ట్రంలోని కంపెనీల నుంచి సరఫరా పెంచితేనే ఇక్కట్లకు తెరపడే అవకాశముందని వ్యవసాయనిపుణులు భావిస్తున్నారు.



గజ్వేల్‌లోని ఓ ఎరువుల దుకాణంలో యూరియా నిల్వలు

గజ్వేల్: జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి 5.60లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇందులోభాగంగానే వరి 3.76లక్షల ఎకరాల్లో సాగులోకి వస్తుందని అంచనా వేయగా ప్రస్తుతానికి 3,257ఎకరాల్లో సాగులోకి వచ్చింది. 1,05,050 ఎకరాల్లో వరి నారు సిద్ధంగా ఉంది. మరికొద్ది రోజుల్లో వరి సాగు ఊపందుకునే అవకాశముంది. ఈ క్రమంలో యూరియా వినియోగాన్ని రైతులు పెంచనున్నారు.

వచ్చింది 6,140 మెట్రిక్ టన్నులే

ప్రస్తుత సీజన్‌లో యూరియా అవసరాలకు, ఇప్పటివరకు వచ్చిన నిల్వలకు పొంతన లేకుండా పోయింది. నిజానికి వానాకాలం సీజన్ మొత్తానికి 35,144 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేయగా ఇప్పటివరకు 6140 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. జూన్‌లోనే 3,240 మెట్రిక్ టన్నులు అవసరముండగా 1,932 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. ఈ లెక్కన జూన్‌లో 1,308మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా వచ్చింది. ఇక జూలైలో 5,200మెట్రిక్ టన్నుల అవసరానికిగానూ ఇప్పటివరకు 2,900మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. ఈ లెక్కన 2,300మెట్రిక్ టన్నులు లోటు ఉంది. వాస్తవానికి గతంలో సెప్టెంబర్ వరకు ఉండే వానాకాలం సీజన్ అవసరాలకు యూరియా 80%వరకు ముందుగానే నిల్వ వచ్చేది. జూలై, ఆగస్టు వరకు పూర్తిస్థాయి నిల్వలు అందుబాటులో ఉండేవి. కానీ, నేడు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి వచ్చే అవకాశముంది



ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి యూరియా నిల్వలు తగ్గిన మాట వాస్తవమే. యూరియా దిగుమతులకు బ్రేక్ పడటం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా నిల్వలు వచ్చే అవకాశముంది. ఇది జరిగితే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

-రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

ఆయా దేశాల్లో యుద్ధ వాతావరణమే కారణమా?

మన దేశం యూరియా దిగుమతి చేసుకునే దేశాల్లో ప్రస్తుతం యుద్ధ వాతావరణం అలుముకోవడంతో దిగుమతులకు బ్రేక్ పడినట్లు చెబుతున్నారు. దీనివల్ల ఇంపోర్టెడ్ యూరియా నిల్వలు తగ్గి కొరత తలెత్తనుంది. కొన్ని జిల్లాల్లో యూరియా కోసం ఇప్పటికే షాపుల ముందు రైతులు బారులు తీరుతున్నారు. కొద్ది రోజుల్లోనే సిద్దిపేట జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితికి అడ్డుకట్ట పడాలంటే ఆర్‌ఎఫ్‌సీఎల్(రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్) నుంచి కావాల్సిన నిల్వలు తెప్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది.



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

- కలెక్టర్ హైమావతి ఆదేశం
- జిల్లాలో వివిధ గురుకులాల తనిఖీ

సిద్దిపేటఅర్బన్/సిద్దిపేటరూరల్/దుబ్బాక/మిరుదొడ్డి(దుబ్బాక)/తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకిచ్చిన 6,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కె.హైమావతి పేర్కొన్నారు. జిల్లాలోని ఆయిల్‌ఫెడ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్ష చేశారు. అనంతరం హుస్నాబాద్‌లోని గిరిజన గురుకుల పాఠశాల, పోతారం(ఎస్)లో జ్యోతిరావ్ పూలే బాలికల గురుకులం, జిల్లెలగడ్డలోని ఎస్సీ, ఎస్టీ గురకులాలు, కొండపాక మండలంలోని దుద్దెడలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాల,మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...జిల్లాలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి రైతులకు కేంద్రం ద్వారా వచ్చే అన్ని పథకాలను అందేలా చూడాలన్నారు. ఆయిల్‌ఫాం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గురుకుల విద్యాలయంలో చదివే బాలికలకు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు వారి భద్రత కూడా ముఖ్యమన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం హాస్టళ్లలోని వంటగదులు, స్టోర్ రూమ్‌లను, రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట వివిధ మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ భవన్‌లో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో తిరుపతిరెడ్డి పాల్గొని మాట్లాడారు. బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. పాఠశాలల పర్యవేక్షణ ఎంఈఓలదేనని అయితే ఉపాధ్యాయులకు అప్పగించడం వల్ల వారిపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కావెంజర్లకు నాలుగు నెలల నుంచి వేతనాలు, బిల్లులు అందడం లేదని వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2023 నుంచి రావాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేట కీర్తి ఇనుమడింపచేయాలి

చైతన్యశ్రీకి అభినందన సభలో ఎమ్మెల్యే హరీశ్‌రావు



చైతన్యశ్రీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: జాతీయ స్థాయి అండర్ 17 ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన సిద్దిపేట క్రీడాకారిణి చైతన్యశ్రీని శనివారం మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు అందజేశారు. అన్ని రకాల క్రీడలకనుగుణంగా ముందుచూపుతో వసతులు కల్పించామన్నారు. వాటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సిద్దిపేట కీర్తిని ఇనుమడింపచేయాలన్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ అక్బర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ సాజిద్, రాము తదితరులు పాల్గొన్నారు.

మాటు వేసి వేటేశారు

- వ్యక్తి దారుణహత్య
- పదునైన ఆయుధంతో నరికిన దుండగులు
- సిద్దిపేట జిల్లా వేలూరులో ఘటన



రాయన్న నర్సయ్య

వర్గల్(గజ్వేల్): ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్తున్న వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో నరికారు. కలకలం రేపిన ఈ ఘటన శనివారం సాయంత్రం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వేలూరు శివారులో జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన రాయన్న నర్సయ్య(65) తనకు ఉన్న కొద్దిపాటి పొలాన్ని కౌలుకు ఇచ్చాడు. కౌలురైతు విత్తన వడ్ల బస్తా తెమ్మనడంతో శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో తీసుకుని పొలానికి బయల్దేరాడు. మార్గమధ్యలో పెద్దమ్మ తల్లి ఆలయ సమీపంలో గుర్తు తెలియని ఆగంతకులు అతని వాహనాన్ని ఆపి పదునైన ఆయుధంతో గొంతు, కన్ను, తలపై నరికి హతమార్చారు. హత్య సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి, పలు ఆధారాలు సేకరించారు. గజ్వేల్ ఏసీపీ నర్సింహులు ఘటనా స్థలం సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. హంతకులను గుర్తించేందుకు అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మనవరాళ్లను చేరదీసి..

కాగా మృతుడి భార్య మల్లవ్వ పాముకాటుకు గురై పదిహేనేళ్ల క్రితం మృతి చెందింది. ఐదేళ్ల క్రితం ప్రమాదవశాత్తు కుమార్తె ఎల్లవ్వ మృతిచెందగా, ఏడేళ్ల క్రితం అల్లుడు మల్లేశం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వీరి ముగ్గురు కూతుర్లు ప్రవంతి, కల్యాణి, పూజలను తాత నర్సయ్య చేరదీశాడు. ప్రవంతి, కల్యాణి వివాహం జరిపించగా, ప్రస్తుతం చిన్న మనవరాలు పూజ తాత వద్దే ఉంటుంది. తమకు ఆసరాగా నిలిచిన తాత నర్సయ్య హత్యకు గురవడంతో మనవరాళ్ల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పొద్దు గడిచేదెట్లా..?

- పంచాయతీ కార్మికులకు 4 నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న 2,217 మంది కార్మికులు
- వేతనాలు ఇవ్వాలంటూ వేడుకోలు



దుబ్బాక ఎంపీడీవో కార్యాలయం ముందు వేతనాల కోసం ధర్నా చేస్తున్న కార్మికులు

దుబ్బాక/దుబ్బాకటౌన్: అసలే వర్షాకాలం మొదలైంది. వర్షా కాలంలో గ్రామాలను మరింత పరిశుభ్రంగా ఉంచే బాధ్యత పంచాయతీ కార్మికులపైనే ఉంది. నిత్యం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల కష్టాలను పట్టించుకునే నాథుడే లేడు. వీరికి 4 నెలలుగా జీతాలు లేకపోవడంతో దినదినగండంగా కాలం వెళ్లదీస్తున్నారు. వేతనాల కోసం అడిగితే బలవంతంగా కార్మికులను తొలగిస్తుండటంతో ఏం చేయాలో తోచక కార్మికులు తల్లడిల్లుతున్నారు. తమ వేతనాలు చెల్లించి మా కుటుంబాలను కాపాడాలంటు కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.


జిల్లాలో 508 గ్రామ పంచాయతీలు

జిల్లా వ్యాప్తంగా 508 గ్రామ పంచాయతీల్లో 2,217 మంది కార్మికులు పని చేస్తున్నారు. జీతాలు సరిగా రాక, వేరే పని చేయలేక, ఉన్న పని వదిలిపెట్టలేక మనోవేదనకు గురవుతున్నారు. మురుగు కాల్వలు, వీధులను శుభ్రం చేయడం, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో తరలించడంలాంటి పనులు చేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

నిధుల్లేక జీతాలు ఇవ్వలేక

ఐదేళ్లుగా జీపీ పాలకవర్గం, సర్పంచ్ వారి జీత భత్యాలు చూసుకునేవారు. వారి పదవీకాలం పూర్తయ్యాక వేతనాలు నెలనెలా రావడం లేదని కార్మికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో గత కొన్ని నెలల నుంచి ప్రభుత్వం నేరుగా కార్మికుల ఖాతాల్లో జీతాలు వేస్తోంది. కానీ మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల జీతాలు ప్రభుత్వ ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ సైతం భారమవుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే చాలీచాలని వేతనాలు సమయానికి రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కార్మికుల వేతన సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నారు.


మంత్రి దృష్టికి తీసుకెళ్లాం



గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే కార్మికుల వేతనాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్మికులు ఆందోళన చెందవద్దు. కార్మికుల వేతనాలతో పాటు వారి అన్ని సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం.

-డీపీఓ దేవకీదేవి

ఇబ్బందుల్లో కార్మికుల కుటుంబాలు



ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను 9,500ల నుంచి 18 వేల వరకు పెంచుతామని ప్రభుత్వం హామీనిచ్చింది. పెంపు మాట దేవుడెరుగు ఉన్న వేతనాలే ఇవ్వడం లేదు. వేతనాల్లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-భాస్కర్, సీఐటీయూ జిల్లా నాయకుడు

నాచగిరి మాస్టర్‌ప్లాన్ సీఎం దృష్టికి తీసుకెళ్తాం

- ఆలయాభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం
- డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): తెలంగాణ భక్తజన నీరాజనాలందుకుంటున్న నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ ఆలయాభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. నాచగిరి మాస్టర్‌ప్లాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. శనివారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని నాచారం గుట్ట ఆలయ పాలకమండలి అభినందన సభకు ఆయన హాజరయ్యారు. గత ప్రభుత్వపాలనలో అభివృద్ధి మాస్టర్‌ప్లాన్‌కే పరిమితమైందన్నారు. మాస్టర్‌ప్లాన్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లి యాదాద్రి తరహాలో నాచగిరి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. భక్తులకు మౌలిక సౌకర్యాల కల్పనలో ఆలయ చైర్మన్ రవీందర్‌గుప్త, ధర్మకర్తలు నిమగ్నం కావాలని సూచించారు. నూతన చైర్మన్ రవీందర్‌గుప్త మాట్లాడుతూ...డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సహకారంతో క్షేత్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తదితరులు మాట్లాడుతూ...నాచగిరిలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించి సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దాలని పాలకమండలికి సూచించారు. ఆలయ ఈఓ విజయరామారావు, ధర్మకర్తలు శేఖర్‌గుప్త, ఉషశ్రీ, కిష్టయ్య, పద్మ, సురేందర్ రెడ్డి,తిరుమల్‌రావు, శ్రీహరి, శ్రీనివాస్, నాగరాజు గుప్త, ఎక్స్‌అఫీషియో సభ్యులు జగన్నాథాచార్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల నాటు'డే'

వన మహోత్సవానికి సర్వం సిద్ధం

- జిల్లాలో 17.15 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ఇప్పటికే 4.8 లక్షల గుంతలు తవ్వారు
- పకడ్బందీగా చేపట్టేందుకు అధికారుల ప్రణాళికలు



రామవరం గ్రామంలో మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వుతున్న ఉపాధి కూలీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. మరో వారంలో ఊరూరా కార్యక్రమాన్ని చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నర్సరీల్లో మొక్కలను పంపిణీకి సిద్ధం చేశారు. ఉపాధి హామీ పథకం కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించేలా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

వచ్చేనెల 15కల్లా మొక్కల నాట్లు పూర్తి

జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 17.15 లక్షల మొక్కలు నాటాలని సంకల్పించారు. జిల్లాలో 490 గ్రామాలుండగా అందులో ఒక్కో గ్రామంలో సుమారుగా 2వేలకుపైగా మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రహదారుల వెంట, ప్రాజెక్టులు సమీపంలో, పొలాల గట్లపై, ఆస్పత్రులు, పోలీసు స్టేషన్లు తదితర స్థలాల్లోనూ నాటేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఖాళీ స్థలాల్లో ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా వచ్చే నెల 15 కల్లా మొక్కలను నాటే ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు.

4.8 లక్ష గుంతలు తవ్వారు

జూన్ ఆరంభం నుంచి వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో, పట్టణాల్లో 4.8లక్షల గుంతలను తవ్వించారు. సుమారుగా 20రకాల మొక్కలు నాటడానికి ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో కానుగ, ఈత, జామ, చింత, వేప వంటి రకాలున్నాయి.

గుంతలు సిద్ధం...



వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాన్ని వందశాతం సాధించేలా ముందుకు వెళ్తున్నాం. ఇందుకు అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు పెంచాం. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. ఇప్పటికే మొక్కలు నాటేందుకు జిల్లా వ్యాప్తంగా 4.8 లక్షల గుంతలను తవ్వించి సిద్ధంగా ఉంచాం.

-జయదేవ్ ఆర్య, డీఆర్‌డీఓ, సిద్దిపేట

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్


స్రవంతి

మెదక్‌జోన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సీహెచ్. స్రవంతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఆర్ట్స్ కాలేజీలోని హిందీ విభాగంలో ప్రొఫెసర్ డా.ధరంపాల్ ఫీహల్ పర్యవేక్షణలో అంతిమ్ దశక్ కే దళిత్ కథ సాహిత్య మే వైచారిక్ సంఘర్ష్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ సాధించారు. స్రవంతి ప్రస్తుతం మెదక్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. తన పరిశోధనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యో.. పసి బాలుడు

వేడి గంజి పాత్రలో పడి మృతి


మోక్షిత్

వర్గల్(గజ్వేల్): రెండేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు వేడి గంజి పాత్రలో పడిపోయాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మాదారంలో చోటుచేసుకున్నది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తి స్వామి, మహేశ్వరి దంపతులకు కూతురు, మోక్షిత్(2) కుమారుడున్నాడు. చిన్నారి మోక్షిత్ బుధవారం ఉదయం పెద నాన్న ఎల్లం ఇంట్లో ఆడుకుంటున్నాడు. అక్కడ ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు వేడి గంజి పాత్రలో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్సైకి గాయాలు

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఎస్సైకి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. నార్సింగి గ్రామానికి చెందిన విఠల్ మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాత్రి విధులు ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా ఏడుపాయల శివారులో పెట్రోల్ బంకు వద్ద బైక్ స్కిట్ అయి కిందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మెదక్‌కు అక్కడి నుంచి మెరుగైన వైద్యం హైద్రాబాద్‌కు తరలించారు. కాగా అంబులెన్స్‌లో ఆక్సిజన్ అయిపోయినట్లు సమాచారం. దీంతో అరగంట పాటు అతను ఇబ్బంది పడ్డట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు.

కారు బోల్తా.. స్వల్ప గాయాలు

నారాయణఖేడ్: మండలంలోని ర్యాకల్ సమీపంలో శనివారం సాయంత్రం కారు అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లి చేనులో బోల్తా పడింది. కారులో ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. రోడ్డును తవ్వి కంకర పర్చి వదిలేయడంతోనే కారు అదుపుతప్పి బోల్తా పడిందని మాజీ జడ్పీటీసీ రవీందర్‌నాయక్ వాహనదారులతో కలిసి రోడ్డుపై ఆందోళన చేశారు.

ముగ్గురు అదృశ్యం

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో దంపతులతోపాటు వారి మూడేళ్ల పాప అదృశ్యమైంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన ప్రేంకుమార్ చేగుంట సమీపంలో ఉన్న ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం ప్రేంకుమార్‌కు, అతని భార్య ప్రియకు గొడవ జరిగింది. అనంతరం అతడు డ్యూటీకి వెళ్లిపోయాడు. అతని భార్య, తన మూడేళ్ల కూతురుతోపాటు ఇంటినుంచి వెళ్లిపోయింది. రాత్రి ముగ్గురు ఇంటికి రాలేదు. దీంతో అతని తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



భోజన ప్రియులు ఇష్టంగా తినే ఫుడ్ బిర్యానీ
జిల్లాలో విస్తరించిన సెంటర్లు
వినూత్నమైన పేర్లతో నిర్వహణ
రూ.79 నుంచి మొదలు
ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో





బిర్యానీ ప్రియులమండి

నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం

బిర్యానీ.. ఈ పేరు వింటే ఎవరికైనా నోరూరిపోవాల్సిందే. భోజన ప్రియులు లొట్టలేసుకుంటూ ఇష్టంగా ఆరగిస్తారు. వివిధ రకాల బిర్యానీలు తయారు చేస్తూ, వినూత్నమైన పేర్లతో పలు హోటల్స్ కొలువు దీరుతున్నాయి. ఇద్దరు ఫ్రెండ్స్ కలిసినా, ఫంక్షన్, వేడుక, లంచ్, డిన్నర్ సమయంలో బిర్యానీ తింటారు. ప్రతి సంవత్సరం జూలై మొదటి ఆదివారంను ప్రపంచ బిర్యానీ దినోత్సవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):

బిర్యానీ మాట వింటే చాలు ఎక్కడో ఉన్నవారు సైతం పరుగున వస్తారు. ఘుమఘుమలాడే బిర్యానీని తయారు చేయడంలో అనేక పద్ధతులు ఉన్నాయి. బిర్యానీ అనగానే కేవలం చికెన్ బిర్యానీ మాత్రమే కాదు. వెజిటేబుల్, ఆలు, ఎగ్, చేప, రొయ్య, కాజు, మటన్, నాటుకోడి బిర్యానీతో పాటు పలు రకాలున్నాయి. అయితే కొందరు ఇంట్లోనే తయారు చేస్తుండగా, అధికంగా హోటళ్లలో మిత్రులతో కలిసి తింటున్నారు. జిల్లాలోని పలు హోటళ్లలో ప్రతి రోజు దాదాపు ఐదువేల బిర్యానీలు వరకు విక్రయిస్తుండటంతో భోజన ప్రియులు ఎంతగా ఇష్టంగా తింటున్నారో అర్థం అవుతుంది.

జిల్లాలో 200 సెంటర్లు..

సిద్దిపేట పట్టణంలో పలు హోటళ్లు కేవలం బిర్యానీ మాత్రమే విక్రయిస్తూ ప్రత్యేకతను చాటుతున్నాయి. దాదాపుగా జిల్లాలో 200 వరకు బిర్యానీ సెంటర్‌లు ఉన్నాయి. మొబైల్ బిర్యానీ సెంటర్‌లు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో మధ్యాహ్నం సమయంలో కొలువు తీరుతున్నాయి. మొబైల్, చిన్న సెంటర్‌లో బిర్యానీ ధర రూ.79 నుంచి ప్రారంభం అవుతుంది. అలాగే వివిధ హోటల్స్ పార్సిల్ ద్వారా అందిస్తుండగా, ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్ చేసి తెప్పించుకొని తింటున్నారు.



ఆకర్షించే పేర్లతో..

బిర్యానీ విక్రయించే హోటల్స్ వివిధ పేర్లతో భోజన ప్రియులను ఆకర్షిస్తున్నారు. జైల్, మండి, ట్రైన్, సూట్‌కేస్, కుండ, మన ఇంటి బిర్యానీ అని ఇలా వివిధ రకాల పేర్లతో నిర్వహిస్తున్నారు.

➤ **మండి బిర్యానీ**

ఇక్కడ నిర్వాహకులు భోజన ప్రియులను కిందే కూర్చోబెట్టి ఒక పెద్ద పాత్రలో బిర్యానీని అందిస్తారు. దానిని మిత్రులందరూ కలిసి ఒకే పాత్రలో తింటారు.

➤ **ట్రైన్ బిర్యానీ...**

రైల్వే స్టేషన్‌లో ప్లాట్ పామ్ పైకి రైల్ వచ్చినట్లు, వ్యక్తి కూర్చున్న టేబుల్‌పైకి చిన్న ట్రైన్ ద్వారా ఫుడ్ వస్తుంది. టేబుల్స్‌కు సిద్దిపేట, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ తదితర పేర్లు పెట్టారు. ఆహార ప్రియుడు తనకు నచ్చిన పట్టణం పేరు ఉన్న టేబుల్‌పై కూర్చొని బిర్యానీ తింటున్నారు.





జైల్ బిర్యానీ

హోటల్‌నే జైలుగా మార్చి ఫుడ్ లవర్స్‌ను ఆకర్షిస్తున్నారు. హోటల్‌కు వచ్చే వారిని జైల్ సెల్‌లో పెట్టి బిర్యానీ అందిస్తున్నారు. అయితే ఇక్కడ అడుగుపెట్టగానే జైలునే తలపిస్తుంది. ఆహారం జైలు సెల్‌లో కూర్చున్న వారి వద్దకే సర్వర్ వచ్చి వడ్డిస్తాడు. దీంతో ఇలాంటి వింత పేర్లతో పాటు, మంచి నాణ్యమైన బిర్యానీ అందించే హోటల్స్‌కు భోజన ప్రియులు తమ మిత్రులతో కలిసి వస్తున్నారు.

ఇష్టంగా తింటా



నేను బిర్యానీని ఇష్టంగా తింటా. సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో అనేక హోటల్స్‌లో తిన్నాను. ఏదైనా పని మీద బయటకు వెళ్లినప్పుడు, స్నేహితులతో కలిసినప్పుడు వారంలో రెండు సార్లు అయినా తింటా.

– కిష్టారెడ్డి, ఆర్ అండ్ ఆర్ కాలనీ, గజ్వేల్

రోజు 700 పైగా విక్రయిస్తాం



జిల్లాలో మంచి నాణ్యమైన బిర్యానీని అందిస్తామనే పేరు మాకు ఉంది. ప్రతి రోజు మా హోటల్‌లో దాదాపు 700పైగా విక్రయిస్తున్నాం. విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ ప్రాంతాల నుంచి సిద్దిపేటకు వచ్చే వారు, పట్టణ వాసులు, వ్యాపారులు మా హోటల్‌కు అధికంగా వస్తారు. వారికి ఇష్టమైన బిర్యానీని ఆరగిస్తున్నారు. అధికంగా చికెన్, మటన్, ఫిష్, వెజిటెబుల్ బిర్యానీ విక్రయిస్తున్నాం.

– దుర్గరాజు, అక్షయ హోటల్, సిద్దిపేట

వినియోగదారులకు మెరుగైన సేవలు


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ కామేష్ తదితరులు

జహీరాబాద్ టౌన్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ కామేష్ అధికారులకు సూచించారు. శనివారం జహీరాబాద్ పట్టణంతోపాటు మొగుడంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గతంలో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'సెల్‌ఫోన్ లైట్‌తో రోగులకు చికిత్స' అనే శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయమై ఆయన ఆస్పత్రిని సందర్శించి విద్యుత్ సరఫరా తీరుపై ఆరా తీశారు. జనరేటర్ ఆటోమెటిక్ ఆన్‌కావడం లేదని గుర్తించి, ఆస్పత్రికి మరో ఫీడర్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ధనసిరి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సత్వార్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌సీ, శ్రీకాంత్, డీఈఈ లక్ష్మీనారాయణ, ఏడీలు మధుసూదన్‌రావు, రజనీకాంత్, ఏఈ సతీష్ ఉన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనీల్ కుమార్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అనీల్‌కుమార్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బదిలీలతో పాటు పదోన్నతులు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనీల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యను విధ్వంసం చేసే విధానాలకు స్వస్తి పలికి, అందరికీ సమాన విద్యను ప్రభుత్వమే అందించాలన్నారు. ఉద్యోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించకుండా, వారి నేంచే డబ్బులు తీసుకోవడం ఇదోరకమైన మోసమని విమర్శించారు. విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్‌లో ఎలాంటి తనిఖీలు చేయకుండా, ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులతో పర్యవేక్షణ చేయించడం సరైన విధానం కాదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, రాజారెడ్డి, భాస్కర్, కంరోద్దీన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో శునకాల ఆరోగ్యం పదిలం


శునకాలకు ఉచిత వ్యాక్సిన్ వేస్తున్న అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): కుక్కలకు టీకాలు వేయడం వల్లం ఆరోగ్యంగా ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ఉమ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని వాటర్ ట్యాంక్ ఆవరణంలో పెంపుడు కుక్కలకు బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ సోహన్‌రాజు 303 కుక్కలకు ఉచితంగా వ్యాక్సినేషన్ చేశారు. ప్రతి శునకానికి ముందుచూపుగా కరిచిన ఏం కాకుండా యాంటి రేబిస్, వ్యాక్సినేషన్ ఎఆర్‌వి, కుక్కకు అంటువ్యాధి సోకకుండా నిర్మూలనకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారి అశోక్‌గౌడ్, బ్లూక్రాస్ నిర్వాహకులు కుమారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


'శాసనమండలిలో ప్రజా గొంతుక' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ కోర్ కమిటీ సభ్యులు

జహీరాబాద్ టౌన్: బీసీలకు పెనుముప్పు శాసన మండలిలో ప్రజా గొంతుక పుస్తకాన్ని శనివారం పట్టణంలోని పద్మశాలి భవనంలో బీసీ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం బీసీ కోర్ కమిటీ సభ్యులు కొండాపురం నర్సింహులు, పెద్దగొల్ల నారాయణ, విశ్వనాథ్ యాదవ్ మాట్లాడారు. బీసీ బిడ్డలకు జరుగుతున్న అన్యాయాన్ని తీన్మార్ మల్లన్న ఈ పుస్తకంలో చక్కగా వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, అశోక్, శేఖర్, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ చిరుతపులి కలకలం

భయాందోళనలో ప్రజలు


ఆనవాళ్లు సేకరిస్తున్న ఫారెస్టు అధికారులు

దుబ్బాక: మళ్లీ చిరుతపులి సంచారం కలకలం రేపింది. రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామ శివారులో చిరుతపులి సంచరిస్తుండటంతో ప్రజలు భయందోళన చెందారు. 50 రోజుల క్రితం గ్రామ శివారులో రైతు పశువుల కొట్టం వద్ద రెండు కుక్కలపై చిరుతపులి దాడి చేసి చంపిన విషయం విదితమే. మళ్లీ శుక్రవారం వ్యవసాయ పొలాల్లో పనిచేస్తున్న రైతులకు చిరుతపులి కనిపించింది. దీంతో రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షేక్ హైమద్ హుస్సేన్ శనివారం అటవీ ప్రాంతాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. రైతు నవీన్ పశువులను మేపుతుండగా గడ్డిలో శబ్దం రావడంతో చూడగా చిరుతపులి కనిపించిందని తెలిపాడు. దీంతో తన పశువులను కొట్టుకొని ఇంటికి వచ్చి గ్రామస్తులకు విషయం చెప్పాడు. చిరుత సంచరించిన ప్రాంతంలో గాలించామని, అడవిలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని ఫారెస్టు అధికారి తెలిపారు. బీట్ ఆఫీసర్లు జహంగీర్, వేణు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అన్వర్(32) భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. రాత్రి కుటుంబ సభ్యులతోపాటు భోజనం చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి భార్య అస్మా లేచి చూసేసరికి ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే పక్కింటివారిని లేపి కిందకు దించి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శాలిపేట గ్రామంలో..

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. వివరాలిలు... శాలిపేట గ్రామానికి చెందిన పచ్చంటి భూపాల్(35) కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే అంబులెన్సులో మెదక్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

భూ వివాదంలో రైతు ఆత్మహత్యాయత్నం

నిజాంపేట(మెదక్): భూ వివాదంలో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన నిజాంపేట మండలంలోని కల్వకుంట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు... గ్రామానికి చెందిన బొడిగె రామస్వామికి మూడెకరాల నాలుగు గుంటల భూమి ఉంది. కానీ తన సమీప బంధువులు అక్రమంగా పట్టా భూమిని మార్చుకున్నారని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కొంతకాలంగా వీరి మధ్య భూ వివాదం జరగడంతో గ్రామస్తులు మాట్లాడినా పరిష్కారం కాలేదు. దీంతో మనస్తాపానికి గురైన రామస్వామి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

నగల కోసమే వృద్ధురాలి హత్య

- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ

గజ్వేల్‌రూరల్: నగల కోసమే వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 24న గజ్వేల్ మండలంలో వృద్ధురాలు హత్యకు గురైన విషయం విధితమే. శనివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజులతో కలిసి ఏసీపీ నర్సింహులు కేసు వివరాలు వెల్లడించారు. ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్ల సత్తవ్వ(70) గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలానికి వెళ్లింది. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న ఓ రైతు చూసి విఘతజీవిగా పడిఉన్న సత్తమ్మను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె ఒంటిపై ఉన్న నగల కోసమే దుండగుడు ఆమె మెడపై పదునైన ఆయుధంతో దాడి చేసి పొడిచినట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో భాగంగా హత్య జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ద్వారా నిందితుడు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కోమటిపల్లికి చెందిన కిచ్చిగారి శివశంకర్‌గా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గత నెల ద్విచక్ర వాహనంపై గజ్వేల్‌కు వచ్చి తిరిగి వెళ్తూ వృద్ధురాలి నగలను దోచుకునేందుకు ప్రయత్నించగా, ఆమె ప్రతిఘటించడంతో ఆమె చేతిలోని కొడవలితో హత్యచేసి పారిపోయినట్లు నేరం అంగీకరించాడు. ఇతడు చేగుంటలో ఆయుర్వేద బోన్‌సెట్టింగ్ వైద్యునిగా చలామణి అవుతూ చోరీలకు పాల్పతున్నాడు. నిందితుడి నుంచి బంగారు గొలుసు, చెవి కమ్మలు, కొడవలి, 5 ద్విచక్ర వాహనాలతో పాటు ఫేక్ నంబర్ ప్లేట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అయినవాళ్లే అంతమొందించారు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనీల్‌కుమార్

- ఆస్తి తగాదాలతో వ్యక్తి దారుణ హత్య
- తాలెల్మ శివారులో పూడ్చేసిన వైనం
- నలుగురు రిమాండ్
- వివరాలు వెల్లడించిన జోగిపేట సీఐ


మంగళి సాయిలు

వట్‌పల్లి(అందోల్): ఆస్తి తగాదాలతో అయినవాళ్ల చేతిలోనే ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల18న ఇంటి నుంచి పొలం పనులకు వెళ్లిన వ్యక్తి కనపడకుండా పోయిన విషయం తెలిసిందే. జోగిపేట సీఐ అనీల్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. పల్వట్ల గ్రామానికి చెందిన మంగళి సాయిలు(53)తన భార్యతో కలిసి జోగిపేటలో ఉంటున్నాడు. అయితే సాయిలుకు అతడి సోదరులకు, సోదరీలకు కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు స్వగ్రామంలో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా పరిష్కారం కాలేదు. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించకపోవడం, భూ విషయమై సాయిలుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చంపాలని అతని తమ్ముడు మల్లేశంతో పాటు భావలు పథకం రచించారు. ఈ క్రమంలో సాయిలు గత నెల 18న పొలం పనులు చేసేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. విత్తనాలు కొనుగోలు చేసి రాత్రి 8 గంటల సమయంలో జోగిపేటకు బైక్‌పై వస్తున్న క్రమంలో తమ్ముడు మల్లేశంతో పాటు బావ సురేష్ వెంబడించి తాలెల్మ శివారులో అడ్డగించారు. రోడ్డు పక్కకు లాక్కెళ్లి బండ రాళ్లతో తలపై మోదగా అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తర్వాత మల్లేశం తన మేనల్లుడు మహేష్‌కు ఫోన్‌చేసి గడ్డపార తీసుకొని, మీ నాన్న లింగయ్యను తీసుకురావాలని చెప్పాడు. నలుగురు కలిసి ఓ కాలువలో గోతి తీసి సాయిలును పూడ్చిపెట్టి వెళ్లిపోయారు. వారం రోజులు గడిచినా సాయిలు ఇంటికి రాకపోవడంతో గత నెల26న భార్య నవరాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే మల్లేశంతో పాటు బావలు సురేష్, లింగయ్య, మేనల్లుడు మహేష్ వారి ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. శనివారం మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన వట్‌పల్లి ఎస్‌ఐ లవకుమార్, క్రైం టీం సురేష్, సంజీవులుతో పాటు సిబ్బందిని సీఐ అభినందించారు.